# గగన కుసుమం

అర్ధరాత్రి దాటింది. ఊరు మాటు మణిగింది. ఆశ్రమంలో అమాయకులు, అజ్ఞానులు ఆదమరిచి నిదుర పోతున్నారు.

నిదుర పోని వారు మానవుల మంచితనం మీద నమ్మకం లేని వారు. నిదుర కోసం తపించినా నిదుర రానివారు.

ఆ తరుణంలో, ఆ అమవస నిశిలో పూజామందిరం వదలి స్వామి నిశ్చితానందుల వారు బయటకు వచ్చారు. కునికిపాటు పడుతున్న పరిచారకులు చిరాకుగా, చివాలున లేచి నిలబడి వెంట రాబోయారు. ఆయన వారిని రావద్దని వారించి, సింహద్వారం వైపు నడవటం సాగించారు.

"అర్ధ రాత్రి ఎక్కడికి బయలుదేరారు?" అంటూ ఒక స్త్రీ కంఠం అదిలించింది.

స్వామిజీ ఒక్క క్షణం ఆగి, రవ్వంత వెనక్కి తిరిగి ఆ వ్యక్తి వంక చూశారు.

'రేపు ఉదయం మిమ్మల్ని కలుసుకోవడానికి కేంద్ర మంత్రులువస్తున్నారు. మీకు విశ్రాంతి చాలా అవసరం."

స్వామిజీ వెనక్కి తిరిగి ఆ వ్యక్తి వంక పూర్తిగా చూశారు. ఆ వ్యక్తి సాక్షాత్కరించిన అహంభావంలాగా ఉంది. అంత రాత్రి వేళ కూడా ఏడు వారాలసొమ్ములతో ఉంది. ఆమె వెనుక సిబ్బంది, మారణాయుధాలు, కాపలా కుక్కలు.

పాదం ముందుకు సాగింది. మరి కొన్ని పాదాలు అనుసరించాయి. రెండు నిలువుల ఎత్తు ప్రహరీ దగ్గర ఆగింది. సెర్చిలైట్లు, 'ఎలక్ట్రిక్ వైరుకంచె, **440** వోల్టులు' అని రాసిన బోర్డులు, పుర్రె బొమ్మలు, ఇనుప కటకటాల తలుపులు ...

మనస్సులో నుంచి నిట్టూర్పు వచ్చింది.

"బాగా మంచు పడుతోంది, లోపలికి పోదాం రండి!" అని ఒక భక్తుడి ప్రార్థన.

స్వామిజీ ఏమీ మాట్లాడలేదు.

ఎక్కడి మానుష జన్మం బెత్తిన ఫలమేమున్నది? అని మనస్సు ప్రశ్నించింది.

సింహ ద్వారం వంక ఒక్క క్షణం చూసి వెనక్కి తిరిగి నడవటం మొదలుపెట్టారు. ప్రెస్ దగ్గరకు వచ్చి ఆగారు.

నైట్ షిఫ్టు మేనేజరు స్వామిజీని చూడగానే దగ్గరకు వచ్చి నమస్కారం పెట్టాడు.

"వచ్చే నెల ప్రెస్‌కు పని లేదు. ఏదైనా పుస్తకం అర్జెంటుగా కావాలి. లేకపోతే చాలా నష్టం కలుగుతుంది" అని సవినయంగా మనవి చేశాడు.

"లాభ నష్టాలు...! మనకు, బజారులో ఉన్నా, ఆశ్రమంలో ఉన్నా ఎప్పుడూ ఇదే రంధి, ఇదే ఆలోచన! దీనిని మించిన ఆలోచన నీకు ఎప్పుడూ రాదా?" అంటూ స్వామిజీ అడిగారు. మీరు లాభనష్టాల సంగతి ఎలాగూ పట్టించుకోరు. మిగతా వాళ్లైనా

పట్టించుకోకపోతే ఈ ఆశ్రమం ఎలానడుస్తుంది?" అని స్త్రీ కంఠం గద్దించింది.

స్వామీజీ ఏమీ మాట్లాడలేదు. తన గదిలోకి వచ్చి తలుపులు వేసుకున్నారు.

ఏది తుది? ఏది మొదలు?

ఎన్ని లంపటాలు? ఎన్ని బాధలు?

ఎందుకు ఇదంతా?

భ్రష్టస్య కావా గతిః?

నిదుర రాదు. మనస్సుకునెమ్మది లేదు. దీని కోసమేనా ఈ లంపట మంతా?

లంపటం - ఈ మాట ఎందుకు ఇలా మనస్సుని మథిస్తోంది?

పర్వతం ఎక్కడం చాలా కష్టం. దిగి రావడం చాలా సులభం. కానీ ఒక సారి దిగి రావడం ప్రారంభిస్తే జారుతున్న ఈ భ్రమ నేలకు జారి నిలిచి పోదు. అగాధంలోకి, పాతాళంలోకి దొర్లిపోతుంది. ఎక్కడికి వెళ్లి ఆగుతుందో తెలియదు.

కానీ శిఖరం చేరుకోవాలంటే మళ్లీ ఎన్ని జన్మలు ఎత్తాలో? ఎన్ని ఇడుములు పడాలో!

చాలా కాలం క్రితం - ఆనాడు తన జీవితంలో చాలా చెడ్డ రోజు.

"నీ గదిలో చదివే పద్యాలు విన్నాను, నాయనా! చాలా శ్రావ్యంగా ఉన్నాయి. నాకు, ఒక చిన్న ఉపకారం చేసి పెట్ట కూడదూ" అని ఇంటి యజమానురాలు అంది.

"ఏం చెయ్యాలో చెప్పండి!"

"నాకు ఈ మధ్యన చూపు సరిగా ఆనడం లేదు. రోజూ ఒక గంట సేపు భాగవతం చదివించుకుందామని."

"నాకు ఏమిటి లాభం?"

"నీ దగ్గర అద్దె తీసుకోను."

"అంతేనా?"

"నాతో పాటు నీకు రెండు పూటలా అన్నం, కాఫీ, టిఫిన్ అన్నీ ఇస్తాను."

"సరే!"

తల్లీ,తండ్రీ ఏ నాడో పోయారు. మేనమామ - ఏదో తప్పనిసరిగా లోక నింద కోసం వెరచి సహాయం చేస్తున్నాడు. చాలీ చాలని బ్రతుకు, బడి పంతులు చదువు.

సరేఅన్న మాటతో తన జీవితం మలుపు తిరిగింది. భాగవతం వినడానికి ఇంటావిడ, ఆ పక్క ఇంటి ఆవిడ - ఇట్లా ఒకరి కొకరుగా పెరిగి రోజూ నలభై యాభై మంది రావడం మొదలుపెట్టారు. పండో, ఫలమో తీసుకు రావడం, పావలో, అర్ధో చేతిలో పెట్టడం పరిపాటి అయింది.

ఇల్లు పట్టడం లేదు. సభ ఆలయంలోకి మారింది. జనం పెరుగుతున్నారు. తను చెప్పిన వ్యాఖ్యానం చాలా బాగుందని అందరూ అనడం మొదలు పెట్టారు.

బడి చదువుకు రెక్కలు వచ్చాయి. కానీ అన్ని చదువులనూ మించిన చదువు తనకు

వస్తోంది. ఎన్నో గ్రంథాలు, మహాగ్రంథాలు ఈ నెపంగా తను చదివాడు. అప్పుడే అనిపించింది - బ్రహ్మ సత్యం - జగం మిథ్యం.

పండితులు, పామరులు ఎందరో ... ఎందరో తనకు పరిచయమయ్యారు.

తన కోసం ఒక ప్రత్యేక స్థలం ఏర్పడ్డది. అది ఎవరి వల్ల వచ్చిందో తెలియదు. ఆ స్థలంలో ఆశ్రమం ఏర్పడ్డది.

అథాతో బ్రహ్మ జిజ్ఞాస - అన్న కోరిక మనస్సుకు కలిగింది.

ఆ ప్రయత్నంలోనే ప్రస్థాన త్రయం పూర్తి అయింది. రామాయణ భాగవత భారతాలు పూర్తి అయ్యాయి.

కానీ...

చిత్త వృత్తి నిరోధః యోగః అన్న పతంజలి సూత్రాన్ని పదే పదే వల్లె వేసినా బతుకు యోగించలేదు. పరం కోసం ఎంత పాకులాడుదామన్నా ఇహం దారి ఇవ్వటం లేదు.

సంసారి చిక్కినా, యతి లావెక్కినా అనర్థం. బుద్ధి ఎదగ లేదు కానీ బొర్ర పెరిగింది. మనస్సు శుష్కించింది. శరీరం లావెక్కింది.

గుండె నేనున్నానని ఒకనాడు గుర్తుచేసింది. డాక్టర్లు మందులిచ్చి ఈ శరీరం పంచభూతాలలోకలిసి పోకుండా కాపాడారు.

అప్పుడు తన పరిచర్యకు ఒక సేవిక తన బతుకులో పాదం పెట్టింది. పేదరికం స్త్రీ రూపంలో వచ్చినట్టు ఆ నాడు కనిపించింది.

సుభద్ర!

తెలియకుండానే తన బతుకులో పాతుకుపోయింది. తనకు ఆరోగ్యం చేకూరే సరికి ఆ ఆశ్రమానికి అధికారులు, ఆవిడ, ఆవిడ తాబేదారులు.

తను ఏం చెయ్యాలో, ఎవరితో మాట్లాడాలో, ఏం మాట్లాడాలో - అన్నీ నిర్ణయించేది, శాసించేది సుభద్ర.

భవబంధాలు తెంచుకుని పారిపోదామని ప్రయత్నం చేస్తున్న తనకు ఆ నాటి కానాడు ఉచ్చులు బిగుసుకున్నాయి.

తను ఎవరినీ అర్థించలేదు. సన్యాసం ఇప్పించవలసిందని ఎవరినీ ప్రార్థించలేదు.

కానీ ఎవరు నామకరణం చేశారో, ఏమో - ఒకనాడు తన పేరు స్వామి నిశ్చితానందగా మారింది.

కాషాయ వస్త్రాలు వచ్చాయి. దండకమండలాలు వచ్చాయి. దుకాణం నుంచి.

జనం వేలం వెర్రికి అర్థం పర్థం లేదు. తన ఉపన్యాసాలు, అపస్వరం పాటలు కాసెట్లుగా చేసి అమ్మడం మొదలు పెట్టారు.

రేడియో,టీ.వీ. వారు కూడా తనని వదిలిపెట్టలేదు.

ధనవంతులు రాజకీయనాయకులు - పెద్దమనుషులు లాంటి వారు అనుక్షణం